క్లుప్తంగా

వైభవంగా ముగిసిన అంకమ్మతల్లి అభిషేక పూజలు

ఎర్రగుంట్ల : మండల కేంద్రమైన ఎర్రగుంట్ల పట్టణంలోని నడివూరులో నూతనంగా నిర్మించిన శ్రీ మహా అంకమ్మతల్లి (పార్వతిదేవి) దేవస్థానంలో 41 రోజుల నుంచి జరిగిన వివిధ అభిషేకాలు, పూజలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలో శ్రీ మహాశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిమలతో శివలింగానికి భక్తులు దీపారాధనలతో పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని పూజించారు. పూజ చివరి రోజు కావడంతో భక్తులందరికి ఆలయ కమిటీ నిర్వాహకులు దాతల సాయంతో అన్నదానం నిర్వహించారు.

పెద్దకాంపల్లెలో గ్రామోత్సవం



గ్రామోత్సవంలో గణపతి, సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లె గ్రామంలో టీటీడీ నిధులు, సహకారంతో గ్రామస్తులు కలసి నూతనంగా నిర్మించుకున్న సీతారామాలయంలో ప్రతిష్ట చేయనున్న గణపతి, ఆంజనేయ, సీతారామలక్ష్మణ విగ్రహాలను, శ్రీరామ, సీతాదేవి, లక్ష్మణ, ఆంజనేయ దేవాతా ఉత్సవ విగ్రహాలను మంగళవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో గుడి వద్ద చెక్కభజన, కోలాటం కార్యక్రమాలు, భోజనాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఆలయంలో విగ్రహాలను, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ట చేసి సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పురాతన రేఖాచిత్రాల సందర్శన



ఆదిమ మానవుడి కాలం నాటి రేఖాచిత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ముద్దనూరు : మండలంలోని చింతకుంట గ్రామ శివారులో కొండ ప్రాంతంలో వెలసిన ఆదిమ మానవుని రేఖాచిత్రాలను ఎంపీడీఓ ముకుందరెడ్డి మంగళవారం సందర్శించారు. చింతకుంట గ్రామ పర్యటనలో భాగంగా ఆయన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఉపాధి పనులను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఆయన కొండలో నెలకొని వున్న ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఆదిమ మానవుని కాలం నాటి పురాతన రేఖాచిత్రాలను పరిశీలించారు.

స్టాప్ డయేరియాపై అవగాహన



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీసా బేగం

వేంపల్లె : తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నందిపల్లి గ్రామంలో మంగళవారం స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు హెల్త్ ఎడ్యుకేటర్ షఫీవున్నీసా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలు కలిగిన తల్లులకు డయేరియా లక్షణాలు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. విరేచనాలు తగ్గే వరకు పిల్లలకు ఓఆర్ఎస్ ఇస్తూనే ఉండాలన్నారు. తల్లులు వంట చేసే ముందు, ఆహారం తినిపించేముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రమాదేవి, ఏఎన్ఎం నాగ స్వర్ణలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సగినాల పాల్ ప్రకాష్ బిషప్‌కు అభినందనలు



సగినాల పాల్ ప్రకాష్ బిషప్‌ను సత్కరిస్తున్న ఫాదర్ ఆరోగ్య స్వామి, చిన్నప్ప, తదితరులు

పులివెందుల : కడప కథోలిక మేత్రాసనానికి బిషప్‌గా బాధ్యతలు స్వీకరించిన సగినాల పాల్ ప్రకాష్ బిషప్‌ను స్థానిక పునీత జోజప్ప గారి దేవాలయం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఆరోగ్య స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప అభినందించారు. పులివెందుల పట్టణంలోని పునీత జోజప్ప గారి దేవాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు సగినాల పాల్ ప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దమయస్ రెడ్డి, ఎస్.చిన్నపరెడ్డి, బి.భూషణం, ఎ.రాయపరెడ్డి, ఎక్సలెంట్ నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూలు కరస్పాండెంట్ టీ.ఐ.కుమార్, ఆర్, చిన్నపరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



పులివెందుల పట్టణంలోని లాడ్జీని పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు



నందిమండలం ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న సీఐ చల్లని దొర



పెండ్లిమర్రి మండలం వెల్లటూరులో నాకాబందీ నిర్వహిస్తున్న సీఐ చల్లని దొర



కమలాపురం ఇందిరమ్మ కాలనీలో మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే రోషన్



జమ్మలమడుగులో పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డులు లేని వాహనాలు



ఎర్రగుంట్ల సుందరయ్యకాలనీలో నాకాబందీ నిర్వహిస్తున్న సీఐ నరేష్‌బాబు



కొండాపురం మండలంలో పోలీసుల నాకాబందీ

పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట, తదితర ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు నాకా బందీ నిర్వహించారు. అలాగే పట్టణంలోని పలు లాడ్జిలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ లాడ్జిలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు దిగితే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గంలో ఫ్యాక్షన్ గ్రామాలలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రమణ, ఎస్‌ఐలు నారాయణ, విష్ణు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పెండ్లిమర్రి : దొంగతనాలు జరగకుండా ఉండేందుకు బ్యాంకుల్లో ఎమర్జెన్సీ అలారం ఏర్పాటు చేసుకొని బ్యాంకు చుట్టూ సీసీ కెమెరాలు తప్పని సరిగా ఉండేలా చూడాలని సీఐ చల్లని దొర బ్యాంకు మేనేజర్లకు సూచించారు. మంగళవారం మండలంలోని ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీబీ బ్యాంకులను సందర్శించి దొంగతనాలు జరగకుండా ముందుగా తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి అవగాహన కల్పించారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచాం ఇవ్వాలి

పెండ్లిమర్రి : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ చల్లని దొర హెచ్చరించారు. మండలంలోని వెల్లటూరు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పెండ్లిమర్రి, వీఎన్‌పల్లె ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, మంజునాథ్, పోలీసులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

కమలాపురం : తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, బీడీ కాలనీతో పాటు చుట్టుపక్కల అనుమానిత ప్రాంతాల్లో నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని ఆరు బైక్‌లను, ఒక బొలెరో క్యాంపర్‌ను, ఒక ప్యాసింజర్ ఆటోను సీజ్ చేశారు. ఇంటింటికి తిరిగి కుటుంబ పెద్దలతో మాట్లాడారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా, చెడు సావాసాల బారిన పడకుండా పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, వల్లూరు ఎస్‌ఐలు విద్యా సాగర్, పెద్ద ఓబన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహన రికార్డులు దగ్గర పెట్టుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : వాహనాలకు సంబంధించిన రికార్డులను వాటి యజమానులు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణ సీఐ ఎస్.లింగప్ప జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో రికార్డులు లేని దాదాపు 43 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎర్రగుంట్లలో నాకాబందీ

ఎర్రగుంట్ల : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో నాకాబందీ నిర్వహించారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

మైలవరం : వాహనాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా వాటి యజమానులు కలిగి ఉండాలని రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మైలవరం, తలమంచిపట్నం, దొమ్మరనంద్యాల, పట్టణ పరిధిలోని శివారెడ్డి కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్యాం సుందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించండి

కొండాపురం : గ్రామాల్లో గొడవలకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మంగళవారం టి. కోడూరు, సంకేపల్లె గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా గొడవ పడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వరరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి మాజీ సీఎం వైఎస్ జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

పులివెందుల టౌన్ : ముస్లింల పక్షపాతి మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నూర్ బాషా సంఘం అధ్యక్షుడు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకుడు నూరుల్లా పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తూ, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 15, 16, 24, 25 ద్వారా మత సంస్థల స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నల్ల చట్టాల వలన ముస్లిం, క్రిస్టియన్, ఇతర మతస్తులకు నష్టం కలుగుతోందన్నారు. లౌకిక వాదులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముస్లిం ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న వక్ఫ్ బిల్లును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ముస్లిం సంఘాల సమాజం రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాదర్ బాషా, మురారి చింతల సర్పంచ్ బాబా హుస్సేన్, ఎంపీటీసీ రజాక్, ముస్లిం మైనార్టీ నాయకులు ముత్తవలి, వలి, బాషా, హమీద్, షబ్బీర్, అక్బర్, నూర్, బాబావలి, బాదుల్లా, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



నేలకూలిన అరటి పంటను పరిశీలిస్తున్న మారెడ్డి జోగిరెడ్డి, తదితరులు

లింగాల : నష్టపోయిన అరటి రైతులను ఆదుకుంటామని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఈదురు గాలులతో లింగాల మండలం గుణకణపల్లె, పెద్దకుడాల తదితర గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలమైన ఈదురు గాలులు రైతన్నలను కోలుకోలేని దెబ్బ తీశాయన్నారు. అరటి చెట్లు నేలకూలడం చాలా బాధగా ఉందన్నారు. నష్టపోయిన రైతులకు వెన్నుదన్నుగా ఉంటామని, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వర్షాలతో పత్తి పంటకు ఊరట



వేములలో సాగు చేసిన పత్తి పంట

వేముల : మండల వ్యాప్తంగా వేసవిలో సాగు చేసిన పత్తి పంటకు సోమవారం రాత్రి కురిసిన వర్షం ఊరటనిస్తోంది. నియోజకవర్గ వ్యాప్తంగా వేసవి పంటగా మార్చి నెలలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో సకాలంలో నీటి తడులు అందిస్తున్న పత్తి పంటలో ఎదుగుదల లేదు. దీనికితోడు అధిక వేడి, అధిక ఎండలతో చీడ పీడలు కూడా పంటకు సోకాయి. దీంతో పత్తి పంట సాగు చేసిన 20 రోజులకే ముడత తెగులు నివారణకు మందులను పిచికారి చేశారు. సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో కొద్దిమేర భూములు పదును అయ్యాయి. పత్తి పంటకు నీటి తడులు ఇవ్వడంతో తేమ ఉండటం, వర్షాలు పడటంతో పత్తి పంట ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం కలిగిందని రైతులు అంటున్నారు. వర్షాలతో పత్తి పంటకు సోకిన ముడత తెగులు కూడా నివారణ అవుతుందని రైతులు అంటున్నారు.

సకాలంలో నీటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : నిర్దేశించిన సమయంలో నీటి పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన సచివాలయాల సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార కొళాయిలను రెగ్యులర్ చేయిస్తూ నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వడ్డీ మొత్తంలో 50శాతం తగ్గింపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మునికుమార్, సచివాలయ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలి



ప్రభుత్వాసుపత్రికి వీల్ చైర్స్‌ను వితరణగా అందిస్తున్న కగేశ్వర్, తదితరులు

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆసుపత్రి ఆర్ఎం నవీన్‌కుమార్‌లు పేర్కొన్నారు.

మంగళవారం పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, నడవలేని వృద్ధులకు తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన కగేశ్వర్ మానవతా దృక్పథంతో వీల్ చైర్స్‌ను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో తమవంతు సహాయ సహకారాలు అందిస్తే ఎలాంటి సమస్యలు రావన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ పవన్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

వేంపల్లె : వేంపల్లి గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నూతన బోరు పాయింట్‌కు పూజలు చేశారు. వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా చింతల మడుగుపల్లె గ్రామంలో బోరు వేశారు. గ్రామపంచాయతీ పరిధిలో రెండు మూడు చోట్ల తాగునీటి సమస్య ఉందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించండి



కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని పాత గంగిరెడ్డి ఆసుపత్రి మెయిన్ రోడ్డు సమీపంలో ఒక పాత భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. వర్షాలు వస్తే ఈ భవనం ఎప్పుడైనా కూలుతుందని స్థానికులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

21న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎర్రగుంట్ల : గ్రామీణ పేదలకు భూ పంపిణీ అమలు చేయాలని ఈనెల 21న కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ తెలిపారు. మంగళవారం చిలంకూరులోని ఎస్టీ కాలనీలో సమస్యలను తెలుసుకున్నారు.

కందుల శివానందరెడ్డి చిరస్మరణీయుడు

వేంపల్లె : కందుల శివానంద రెడ్డి చేసిన సేవలు మరువలేనివని, అందుకే ఆయన చిరస్మరణీయుడని పలువురు పేర్కొన్నారు. వేంపల్లె పట్టణంలోని కందుల ఓబుళరెడ్డి ఐటీఐలో మంగళవారం కందుల శివానందరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల శివానందరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రసాదరావు, వెలమవారిపల్లె మాజీ సర్పంచ్ రహీం, అమర్‌నాథ్, ప్రభాకర నాయుడు, విజయ భాస్కర్, చంద్రశేఖర్, ఉత్తమారెడ్డి, వెంకటరెడ్డి, మార్కయ్య, ఆది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యమెందుకు?

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం ఎందుకు చేస్తోందని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎల్లయ్య ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు ఎందరో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం గడిచిపోయినా ఇంత వరకు డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదన్నారు.

రైతులకు విక్రయించిన మందులకు రసీదులు ఇవ్వాలి

తొండూరు : రైతులకు మందులు కానీ, ఎరువులు కానీ విక్రయిస్తే వాటికి రసీదులు ఇచ్చి పంపించాలని ఏఓ మధుసూదన్‌రెడ్డి డీలర్లకు సూచించారు. మంగళశారం మండల కేంద్రమైన తొండూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల దుకాణాల డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి డీలర్ తమ షాపులో స్టాక్ బోర్డు, బిల్ బుక్కులు, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు.

మత విశ్వాసాలను గౌరవించాలి



మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ముస్లిం నాయకులు

వేంపల్లె : వక్ఫ్ నిర్వహణ సరిగా లేకుంటే జోక్యం చేసుకోవాలే తప్ప, మత విశ్వాసాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు వ్యవహరించకూడదని వేంపల్లె మండల వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15లను ఉల్లంఘించడమే కారణమన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం కల్పించడమే రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ బోర్డు సవరణతో ముస్లింలకు అన్యాయం జరుగుతుందని, రాజ్యసభలో బిల్లుకు వ్యతిరేకంగా జగన్‌మోహన్ రెడ్డి ఓటు వేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ పిటిషన్ వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, ఎంపీటీసీ రహమతుల్లా ఖాన్, మాజీ వక్ఫ్ బోర్డ్ మెంబర్ ఖాదిరుల్లా, వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు సుబహాన్, రెహమాన్, ఫక్రుద్దీన్, హాసన్, అల్లా రఖా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి, సిబ్బంది



నీటి విన్యాసాలు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్, మెయిన్ బజార్, పాత బస్టాండు తదితర ప్రాంతాలలో మంగళవారం అగ్నిమాపక శాఖ అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజలకు నీటి విన్యాసాలు చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అబ్బుర పరచిన అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు

కమలాపురం : అగ్నిమాపక సిబ్బంది చేసిన నీటి విన్యాసాలు అబ్బుర పరిచాయి. ఈ నెల 14వ తేదీ నుంచి ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఫైర్ సిబ్బంది చేసిన నీటి విన్యాసాలు అబ్బుర పరిచాయి. లాంగ్ బ్రాంచ్, షార్ట్ బ్రాంచ్, లండన్ హ్యాండ్ కంట్రోల్ బ్రాంచ్, ట్రిపుల్ పర్పస్ నాజిల్, డిఫ్యూజర్ బ్రాంచ్, రివాలివ్ంగ్ బ్రాంచ్‌లతో నీటి విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే లైన్‌ను రైతులకు ఇబ్బంది లేకుండా మార్చాలి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని నిడుజివ్వి రెవెన్యూ గ్రామంలో కొత్తగా వేస్తున్న రైల్వే లైన్ ద్వారా రైతులకు ఇబ్బందులు కలగకుండా లైన్‌ను మార్చి వేయాలని రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు గోపాలయ్య, పద్మనాభం, చిన్నమునెయ్య, రామచంద్రారెడ్డి, శివయ్య, శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ లైన్ వల్ల తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అంతేకాకుండా తమకు జీవనాధారమైన వ్యవసాయ భూములను కూడా కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పులివెందుల రూరల్ : దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య పేర్కొన్నారు.

మంగళవారం పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూలులో విద్యార్థులకు దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి భాకరాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగీ, మెదడు వాపు, చికున్ గున్యా, బోదకాలు తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశా కార్యకర్తలు శిరీష, జ్యోతి, ప్రిన్సిపల్ రవి కాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుంపలగట్టు అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



దుంపలగట్టు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఖాజీపేట : దుంపలగట్టు అంకాలమ్మ జాతరను పురస్కరించుకుని చివరి రోజు మంగళవారం ఆలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం ఆదినారాయణరెడ్డిల ప్రత్యేక ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ రామగోవిందరెడ్డి, బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మైదుకూరు మాజీ మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీమన్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజోలు వీరారెడ్డి, మండల కన్వీనర్ మురళీ మోహన్‌రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరు రెడ్యం సోదరులు ఇచ్చిన విందులో పాల్గొన్నారు.